క్లుప్తంగా

సీతారామాంజనేయ ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న హనుమాన్ భక్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలోని సీతారామాంజనేయ ఆలయ అభివృద్ధికి హనుమాన్ మాల ధారులు రూ.11,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పంచాయితీ

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలపై పలువురు సోషల్ మీడియాలో పోస్టు చేయడం వివాదానికి దారితీసింది. తపాస్‌పల్లి గ్రామంలో వేసవికాలం వచ్చినప్పటి నుంచి తాగునీటి సమస్య ఉందంటూ పలువురు యువకులు గ్రామానికి సంబంధించిన వాట్సాప్ గ్రూపులలో పోస్టులు పెట్టారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ వాటిలో పేర్కొన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి పంచాక్షరి తనకు సంబంధంలేని విషయాలలో అవమానిస్తూ, మూడు నెలలుగా వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ యువకులను పిలిచి కౌన్సెలింగ్ చేశారు.

ముగిసిన టెట్

చివరి రోజు 86మంది హాజరు


హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

సిద్దిపేటఅర్బన్: పొన్నాలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఆదివారంతో ముగిసింది. చివరి రోజు పరీక్షకు 86మంది హాజరయ్యారు. సీబీటీ విధానంలో ఉదయం 9 నుంచి 11.30 వరకు నిర్వహించిన పరీక్షకు 41మంది హాజర య్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30వరకు నిర్వహించిన పరీక్షకు 45మంది హాజరయ్యారు. 14మంది గైర్హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ నాగభూషణం, టీసీఎస్ రాకేష్, పీఆర్వో రఘు, సిస్టం అడ్మిన్ షాదుల్లా, డీపీ రావు, కరీమొద్దీన్, రాజేశ్వర్ పర్యవేక్షించారు.

స్నేహితుడికి చేయూత


ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): అనారోగ్యంతో బాధపడుతున్న జగదేవ్‌పూర్‌కు చెందిన పనుగట్ల ధనుంజయ్‌కు చిన్ననాటి స్నేహితులు ఆర్థికంగా అండగా నిలిచారు. ఆయన కొద్ది నెలలుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న 1992 –93 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ధనంజయ్‌ను పరామర్శించి రూ.65వేలు అందించి మనోధైర్యం కల్పించా రు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులా?

చిన్నకోడూరు(సిద్దిపేట): సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తుచేస్తే బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని బాధితుడు ఉడుత ఎల్లయ్య ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఎల్లాయపల్లి పంచాయతీలో లక్షల రూపాయల అవినీతి జరిగిందని. ఐదేళ్లలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధిపై ప్రశ్నిస్తే మాజీ సర్పంచ్, గ్రామస్థాయి అధికారితో కలిసి బెదిరింపులకు పాల్పడుతూ దాడులుచేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గ్రామంలో అభివృద్ధి పేరుతో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి


పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలోని బుగుడాలగల్లి ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా కొనసాగుతున్న పనులను ఆమె పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటరాములు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- అంబరాన్నంటిన ఆవిర్భావ వేడుకలు
- జాతీయ జెండాల రెపరెపలు

తెలంగాణ రాష్ట్ర పదో ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద సంబంధిత అధికారులు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. ప్రధాన పార్టీల కార్యాలయాల వద్ద సైతం ఆయా పార్టీల నాయకులు జాతీయ పతాకాలు ఎగురవేశారు. రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలను కొనియాడారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి.


సిద్దిపేటకమాన్: జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి


సిద్దిపేటకమాన్: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి


చేర్యాల(సిద్దిపేట): మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న చైర్ పర్సన్ స్వరూపరాణి


దుబ్బాకటౌన్: వందనం చేస్తున్న జడ్జి తరణి తదితరులు


హుస్నాబాద్: ఏసీపీ కార్యాలయంలో వందనం చేస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి


నంగునూరు(సిద్దిపేట): తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జెండాను ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నేతలు


దుబ్బాక: జెండాను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ గన్నె వనిత తదితరులు


సిద్దిపేటలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ ప్రసన్న


ములుగు(గజ్వేల్): పతాకావిష్కరణ చేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి


కొండపాక(గజ్వేల్): జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ అనసూయ


గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందజేసిన నేతలు

ప్రజల ఆకాంక్షలు నెరవేరాలి

న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని రకాల ప్రజలు ఆకాంక్షలు నెరవేరాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతి రెడ్డి, మిలిండ్‌కాంబ్లి, శ్రావణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటలింగం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు హరిచంద్ర, సత్యనారాయణ, ఆత రాములు, పత్రి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి

దుబ్బాక: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. పట్టణంలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. గాంధీ విగ్రహం వద్ద ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.


హుస్నాబాద్‌రూరల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మానస


కొమురవెల్లి(సిద్దిపేట): జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కీర్తన

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు

గజ్వేల్‌రూరల్: ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ఆడిటోరియంలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో అందించే శిక్షణ స్వీయ క్రమశిక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీలో రోజువారీ జరిగే శిక్షణను, దాని ప్రాధాన్యతను వివరించారు. అనంతరం రాజగోపాల్‌పేట ఫైరింగ్ రేంజ్ వద్ద ఎన్‌సీసీ అధికారి శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో కేడెట్లు శిక్షణ పొందారు. కార్యక్రమంలో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి కెప్టెన్ డాక్టర్ భవాని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలిసి ఉత్సాహంగా గడిపారు. వివిధ చోట్ల స్థిరపడిన వారంతా ఎన్నోయేళ్ల తర్వాత కలుసుకుని క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులు గుర్తుచేసుకుని సందడి చేశారు. తమకు పాఠాలు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

– బెజ్జంకి(సిద్దిపేట)

కరుణించమ్మా.. పోచమ్మా..


బోనాలతో తరలి వస్తున్న మహిళలు

మండలంలోని బేగంపేటలోని ఎస్సీ కాలనీ వాసులు ఆదివారం పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు చేశారు. మహిళలు ప్రధాన వీధులగుండా బోనాలతో ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. సంవృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవార్లను కోరుకున్నారు. ప్రతి ఏటా తల్లులకు బోనాలు చేయడం ఆనవాయితీ అని మహిళలు తెలిపారు.

– బెజ్జంకి(సిద్దిపేట)

చాముండేశ్వరి అమ్మవారికి పూజలు


చాముండేశ్వరి అమ్మవారి కుంకుమార్చనలో భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేశారు. ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

నల్లపోచమ్మ ఆలయం కిటకిట


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి.. శ్రీనల్లపోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా కనిపించింది. ఉదయం ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద డప్పు చప్పుళ్ల .. శివసత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఐలమ్మకు నివాళి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆదివారం రజక సంఘం నాయకులు, సభ్యులు నివాళులు అర్పించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రజక సంఘం సభ్యులు ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి

ఎంపీపీ కృష్ణారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): చిన్ననాటి నుండే మంచిగా చదివి, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పదో తరగతి ఫలితాల్లో 10జీపీఏ సాధించిన ఎంపీటీసీ బొప్ప కనకమ్మ నాగయ్యల కూతురు ప్రణీతను ఆదివారం ఆయన పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రేబర్తి పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ రామ్మోహన్, ఎంపీటీసీ సమ్మయ్య, జూనియర్ అసిస్టెంట్ ముదాసిర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టైపిస్టు ఆజం తదితరులు పాల్గొన్నారు.


ప్రణీతను సన్మానిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

హుస్నాబాద్‌లో భారీ వర్షం


ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద

- జలమయమైన రహదారులు

హుస్నాబాద్: పట్టణంలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఎండ వేడిమి, ఉక్కపోత భరించలేక ఇబ్బందులు పడిన జనం ఒక్కసారిగా ఉపశమనం పొందారు. పట్టణంలోని రహదారులన్నీ జలమయం అయ్యాయి. మెయిన్‌రోడ్‌లో వరద నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా దుకాణాలను ఆనుకొని తీసిన కందకాలలో వర్షం నీరు నిండి చెరువులను తలపించాయి. దీంతో దుకాణదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


దుకాణాల ఎదుట నిలిచిన వర్షం నీరు

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకలకు నార్సింగి మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, నార్సింగి ఎంపీటీసీ సత్యనారాయణ, అంచనూరి రాజేష్, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, చిన్న కృష్ణాగౌడ్, చందు, రఫీ, రాజుగౌడ్, అన్వర్, రుక్మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990